# మనదేశానికి వచ్చేస్తా....



## సి. ఆనందారామం

**కార్నివాల్ ఊరేగింపుతో ముందుకు వెళ్తోంది- రకరకాల ఫ్యాన్సీ డ్రెస్‌లతో ఒక చేత్తో బీర్‌టిన్ పట్టుకుని తాగుతూ, మరో చేత్తో చారిటీ డబ్బా గలగల లాడిస్తూ, నవ్వుతూ తుళ్ళుతూ చిల్లర డబ్బులు అడుక్కుంటున్నారు స్త్రీపురుషులు.**

ఆ దృశ్యం చాలాసరదాగా, ఉత్సాహంగా వుంది. రకరకాల వేషాలు- కొందరు మొగవాళ్ళు ఆడవాళ్ళ వేషాలు వేసుకుని నవ్వుతూ నవ్విస్తూ డాన్స్‌చేస్తూ చారిటీ డబ్బా గలగలలాడిస్తూ ముందుకు సాగుతున్నారు.

కొందరు ఆడపిల్లలు కర్రల సాయంతో బాగా పొడుగ్గా జియంట్స్ లాగ కనపడుతూ ఆ కర్రలమీదే బేలన్స్ తప్పకుండా నడుస్తున్నారు.

రకరకాల వ్యాపార సంస్థల తాలూకు లారీలు,- కార్లు, వాటిలో నవ్వుకొంటూ తుళ్ళుకొంటూ వింత వింత వేషాలతో స్త్రీపురుషులు కొందరు తాబేళ్ళూ, కుందేళ్ళూ మొదలైన జంతువుల వేషాలు వేసుకున్నారు. మరికొందరు కుష్ఠు రోగుల లాగ వేషాలువేసుకుని తమని చూసే వారిని భయపెడుతున్నారు. నిజంగా చూడగానే భయం కలిగేలాగానే వున్నాయి వాళ్ళ వేషాలు. మరికొందరు నాలుక బయట పెట్టి పిచ్చివాళ్ళలాగ నటిస్తున్నారు. ఒకడు తలకు కొమ్ములు తగిలించుకొని, ముఖమంతా నల్లరంగు పూసుకుని తోక కూడా తగిలించుకుని, ఎగురుతూ ముందుకు నడుస్తున్నాడు. అది సైతాన్ వేషమట!

అది వేసవి కాలం. అయినా లండన్ నగరంలో సాయంత్రం అయిదింటికే మంచు కురుస్తోంది. చేతులు చల్లగా కొంకర్లు పోతున్నాయి. అయినా కార్నివాల్‌ని చూస్తూ అక్కడనుంచి కదలాలనిపించటం లేదు. మాలానే రోడ్డుకి రెండు వైపులా జనం బారులుతీర్చి ఉత్సాహంగా చూస్తున్నారు- చిన్నపిల్లలు, పెద్దవాళ్ళు అందరూ చిల్లర డబ్బులు చారిటీ డబ్బాలమీదికి విసిరేస్తున్నారు— కార్నివాల్‌లో ఊరేగింపుగా వెళ్తున్నవారు అవి అందుకొంటున్నారు- వాళ్ళు బెలూన్లు చిన్నపిల్లలమీదికి విసురుతున్నారు- వాళ్ళు అవి హుషారుగా అందుకోబోతున్నారు.

లండన్‌లాంటి మహానగరంలో కూడా ఇలా చారిటీ కోరుతూ చిల్లర డబ్బులు అడుక్కోవటమేమిటని ఆశ్చర్యం కలిగింది— దానికంత పెద్ద ఊరేగింపు కూడా వింతగానే తోచింది. ఆ విషయమే నన్నక్కడికి తీసుకొచ్చిన బాబీ నడిగాను- నార్తాంప్టన్‌లో వుంటున్నాడు బాబీ— "మీకొక గమ్మత్తు చూపిస్తాను ఇవాళ" అని తీసుకొచ్చాడు— నిజంగా లండనంటే అప్పటివరకూ నేను చూసిన అన్నిటికంటె సరదాగా వుంది ఇది.

"ఈ కార్నివాల్ ఇక్కడ సంవత్సరానికొకసారి జరుగుతుంది- ఈ చారిటీ విరాళాలు వికలాంగుల కోసం పోగుచేస్తున్నారు. ప్రముఖ వ్యాపారసంస్థలన్నీ తమవంతు విరాళం కొంత యిచ్చి మరికొంత జనం నుంచి సేకరిస్తాయి— ఈ ఊరేగింపులో వెళ్తున్న స్త్రీ పురుషులంతా మంచి మంచి ఉద్యోగాలలో ఉన్నవాళ్ళే! ఈ ఊరేగింపులో ఎవరైనా పాల్గోవచ్చు— కానీ ముందుగా వాళ్ళ పేర్లు రిజిష్టర్ చేయించుకోవాలి!" వివరించాడు బాబీ!

తాబేలు వేషం వేసుకున్నవాడు పెద్ద బొజ్జను తమాషాగా ఆడిస్తూ నడుస్తున్నాడు- టాప్‌లేని కారులో కూచున్న ఆడపిల్లలు డ్రింక్ తీసుకుంటూ నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటూ చారిటీ డబ్బాలు జనంముందుకు జాపుతున్నారు. అంతలో ఎవరో బీర్ నోటినిండా పోసుకుని పుక్కిలించి మా మీదకు ఉమ్మారు. హడలిపోయి వెనక్కు తగ్గాను— అందరూ వెనక్కు తగ్గారు- కానీ నవ్వుకున్నారు- అలా వుమ్మిన వాళ్ళమీద చి

పడటం లేదు- అదంతా ఆ ఉత్సవంలో ఒక భాగమే! ఆ సమయంలో, సభ్యత అసభ్యత అనేవి ఏమీ లేవు- ఎవరూ అలాంటివి పట్టించుకోరు- "ఇంత కంటె చాలా సరదాగా వుంటుంది, ఫ్యాన్సీడ్రెస్ పార్టీ! ఇక్కడికి దగ్గరలో వున్న పలెలో పెద్దపెద్ద తోటలుంటాయి- అక్కడ చేసుకొంటారు-"

నాకు చాలా కుతూహలం కలిగించి-

"మనం వెళ్ళొచ్చా?"

ఆశగా అడిగాను-

"వెళ్ళొచ్చు- కానీ, అవి ఎప్పుడంటే అప్పుడు జరగవు- ముందే అంతా ఏర్పాటు చేసుకుంటారు- మీరు మరో పదిహేను రోజులు వుండగలిగితే,ఆ పార్టీ కూడా చూపించగలను."

"హమ్మ బాబోయ్! అన్ని రోజులు వుండలేను" అన్నాను. ఇప్పటికే ఇల్లు వదిలి నెలపైగా అయింది. అన్ని రోజులు ఎప్పుడూ ఒంటరిగా ప్రయాణాలు చెయ్య లేదు విదేశాలు చూడాలని కుతూహలం ఎంత వుందో, ఎప్పుడు హైదరాబాద్ వచ్చి వాలుదామా అన్న ఆరాటమూ అంత ఎక్కువవుతోంది.

నెమ్మది నెమ్మదిగా ఊరేగింపు ముందుకు సాగింది. అందరమూ చలికి గడగడలాడిపోతున్నాం. కోట్లు వున్నా- అక్కడి నుంచి కారు పార్క్ చేసిన చోటికి నడుచుకుంటూ వెళ్ళేసరికి వానలో తడిసినట్లు తలంతా తడిగా అయిపోయింది.

రాణి "ఆంటీ! మా ఇంటికి వెళ్దాం!" అంది. రాణి డాక్టర్ కృష్ణ కూతురు. వాళ్ళు కెంట్‌లో వుంటున్నారు. నేను రమ్మంటే నాతో వచ్చింది.

"ముందు మా ఇంటికి వచ్చి కాఫీ తాగి అప్పుడు వెళ్ళండి-" అన్నాడు బాబీ. నాకూ ముందు వేడివేడి కాఫీతాగాలనే వుంది—అంత చలిగా వుంది.

"కొంచెంసేపు కూచుని వెళ్దాం!" అన్నాను రాణికి నచ్చచెప్తూ. అక్కడ అందరికీ విపరీతమైన మర్యాదలు.సాధారణంగా ఎదుటివాళ్ళ మనసు కష్టపెట్టరు. రాణికి వుండటం అంత ఇష్టంలేదని తెలుస్తోంది. కాని నా మాట కాదనలేకపోయింది. అలాగని వాళ్ళు అన్నింటికీ మెత్తగా ఊరుకోరు. కొన్ని ముఖ్యమైన విషయాల్లో చాలా నిక్కచ్చిగా ధైర్యంగా తమ అభిప్రాయాలు చెప్తారు ఇంటికి వెళ్ళేసరికి జ్యోతి వచ్చి వుంది.

జ్యోతి బాబీ భార్య. బాబీ ఏదో ప్రైవేట్ కంపెనీలో ఇంజనీర్‌గా వున్నాడు న్యాయానికి ఆర్థిక పరిస్థితుల దృ[illegible] జ్యోతి వుద్యోగం చెయ్యక్కర్లేదు. [illegible] అక్కడ ఎవరూ ఖాళీగా వుండరు. అం[illegible] జ్యోతి కూడా పార్ట్‌టైం జాబ్ చేస్తోం[illegible]. తనను తీసికెళ్ళకుండా వెళ్ళినందుకు జ్యోతి కొంచెంసేపు బాబీతో పోట్లాడింది. అలా అన్యోన్యంగా వుండే భార్యాభర్తలను చూస్తే నాకెంతో ముచ్చట. బాబీ హీటర్ ఆన్ చేశాడు. నేను అందరికీ కాఫీలు కలిపాను. రాణి ఎవరి కప్పులు వాళ్ళకి అందించింది కాఫీలు తాగుతుండగా బాబీ రిపబ్లిక్ డే కి తమ యూనివర్సిటీలో హిందూ సంఘంవాళ్ళు ఏర్పాటు చేసుకున్న ప్రోగ్రాం అంతా వివరించాడు. వాళ్ళు ఒక నాటకం కూడా వేశారట—వాళ్ళే వ్రాసుకుని.



"ఆంటీ మనం వెళ్దాం!" ఈసారి కొంత అసహనంతో అంది రాణి.

"ఎందుకంత తొందర? మీ అమ్మ తిడతారనా? నేను చెప్తాలే!" అన్నాను నవ్వుతూ. రాణి ముఖం కొద్దిగా జేవురించింది.

"ఛ! అమ్మ నన్ను తిట్టదు. నేనేదైనా పొరపాటుచేస్తే అది అమ్మకు నేనే చెప్తాను. మరొకరు సర్ది చెప్పటం దేనికి?" గతుక్కుమన్నాను– ఇక్కడి పిల్లలతో చాలా జాగ్రత్తగా మాట్లాడాలని గుర్తొచ్చింది. "అయామ్ సారీ!" అన్నాను. రాణి వెంటనే తగ్గిపోయింది.

"నేను టైమ్‌కి ఇంటికి రాకపోతే అమ్మ చాలా వర్రీ అవుతుంది. అమ్మని చికాకుపెట్టడం నాకు ఇష్టం ఉండదు."

ఆ మాటలు నాకెంతో తీయగా వినిపించాయి.

ఎంత ఆరోగ్యంగా పెరుగుతున్నారీ పిల్లలు?

"ఇక వెళ్తాను-" అని లేచాను-

"శనివారం రండి- మనం "స్ట్రాట్ ఫర్డ్ అపాన్ ఏవన్" (Stratford-upon-Avon) కి వెళ్దాం– మీ షేక్స్‌పియర్ జీవించిన ఇల్లూ అతడి నాటకాల వ్రాతప్రతులూ చూడొచ్చు-" అన్నాడు బాబీ-

"మా షేక్స్‌పియరా?"

"అవును మరి! లిటరేచర్‌లో ఇంటరెస్ట్ ఉన్నవాళ్ళందరికీ అతడు కావలసినవాడేకదా!"

ఎంత నిజం? ఇన్నేళ్ళయినా ప్రజల హృదయాలలో చిరంజీవిగా ఉన్న ఆ కవి ఎంత ధన్యుడు!


రాణీ నేను బయలుదేరాం! రాణి కూడా కారు డ్రైవ్ చెయ్యగలదు– మెయిన్ సిటీకి దూరంగా ఉన్న ప్రాంతం కావటంవల్ల డ్రైవ్ చాలా బాగుంటుంది- రోడ్డుకి అటూ, ఇటూ పచ్చని మైదానాలు కళ్ళ పండువుగా– ఎక్కడా సమతలంగా ఉండదు- ఎత్తుగా పైకిలేచి వెంటనే మళ్ళీ లోయలా కిందకి వాలుతుంది అక్కడి నేల- అంచేత ఆ మైదానాలు మరింత అందంగా కనిపిస్తున్నాయి. వ్యవసాయపు భూములుకూడా ఉన్నాయి- రైతులూ, కూలీలూ కనపడరు- పనులన్నీ యంత్ర పరికరాలతోనే అయిపోతాయి. మేం వెళ్ళేసరికి డాక్టర్ రమ ఏదో కుడుతున్నారు. అంత పెద్ద డాక్టరయిన ఆవిడ ఎప్పుడూ, ఏదో చేస్తూనే వుంటారు ఒక్క క్షణమయినా ఖాళీగా కూచోరు.

"వచ్చారా, ఆలస్యమయింది—" అన్నారు మమ్మల్ని చూసి. పెద్దగా వర్రీ అయినట్లు తోచలేదు- కార్నివాల్ సంగతి చెప్పాను. అక్కడే వున్నా. వాళ్ళు అలాంటివి చాలా అరుదుగా చూస్తారట! అసలు టైం వుండదుట! రాణి లేకుండా చూసి అడిగాను, "రాణి రావటం కొంచెం ఆలస్యమయితే మీరు వర్రీ అవుతారా?" అని.

"ఒక రకంగా నిజమే!" అన్నారు డాక్టర్ రమ.

"ఎందుకు? ఆడపిల్లలన్నా ఇక్కడ కూడా అలాంటి రెస్ట్రిక్షన్స్‌లోనే పెంచుతున్నారా పిల్లల్ని? ఇక్కడ చాలా మంది కొంత ఫ్రీగా వున్నట్లు చూస్తున్నానే!"

"అవును. ఫ్రీగానే వుంటున్నారు. కొంతేం కర్మ. బోలెడు ఫ్రీలో వుంటున్నారు. అందుకే నాకు మరింత భయం. ఇక్కడి కుటుంబాలలో తలిదండ్రులకీ, పిల్లలకీ మధ్య అనుబంధాలు చాలా తక్కువ. పిల్లలకు పద్దెనిమిదేళ్ళు వచ్చీ రాగానే పెద్దవాళ్ళనుంచి విడిపోవాలని చూస్తారు చాలా మంది. గవర్నమెంట్ నిరుద్యోగభత్యం ఇస్తుంది. అదీ గాక వాళ్ళు ఏదో ఒక వుద్యోగం తేలిగ్గా సంపాదించుకోగలరు. అందుచేత మా పిల్లల్ని ప్రేమతో తప్ప కట్టి పడేసుకోలేం. ఇక్కడ అందరమూ- ముఖ్యంగా తెలుగు కుటుంబాల వాళ్ళం. పిల్లల్ని ఎంతో ప్రేమతో ఇండియాలో



కంటె పదిరెట్లు బాధ్యతతో పెంచుతాము."

ఈ విషయం నేను ఇంకా మరికొన్ని కుటుంబాలలో కూడా విన్నాను. ఏ తల్లి నోట విన్నా ఇదే ఆవేదన, ప్రతి తండ్రి మనసులోనూ ఇదే హెచ్చరిక!

"మరి ఇలా ఇంతగా భయపడుతూ ఇక్కడ వుండటం దేనికి? మన ఇండియాకి వచ్చెయ్యకూడదూ?"

"ఇండియాకి ఏముంది అక్కడ?" ఎంతో అసహనం ధ్వనించింది డాక్టర్ కృష్ణ గొంతులో. అతడు అప్పుడే హాస్పిటల్ నుంచి వచ్చాడు. అలసటగా సోఫాలో కూచున్నాడు. రమ కాఫీ అందించింది. డాక్టర్ రమలో ఎప్పుడూ అచ్చమైన తెలుగుతనం కన్పిస్తుంది నాకు.

"ఏం? అక్కడ ఏం లేదూ? మన వాళ్ళందరూ వున్నారు. ఆస్పత్రులున్నాయి. ఇక్కడికంటె నిస్సహాయస్థితిలో వున్న రోగులున్నారు. మీ అవసరం ఎంతో వున్న మన తెలుగువాళ్ళున్నారు-"

"అంతేకాదు- దేశానికి మేలుచేసినా, చెయ్యకపోయినా చేసేవాళ్ళను అడ్డగించగల ప్రభుత్వం వుంది. ఆస్పత్రులకు కొత్త మందులు తెప్పించకపోగా వున్న మందులనే ఫలహారం చేసే పెద్దలున్నారు. డాక్టర్‌కి తన డ్యూటీ తను చేసే అవకాశం కూడా ఇవ్వకుండా కాళ్ళూచేతులు కట్టిపడేసే యాజమాన్యం వుంది."

చాలా బిట్టర్‌గా వుంది డాక్టర్ కృష్ణ గొంతు.

"మీరు చెప్పేది నాకర్థం కావటం లేదు."

"అయితే అర్థమయ్యేలాగ చెప్తాను. మీరు రచయిత్రి కదా! ఇలాంటి విషయాలు వుపయోగపడొచ్చు- నే నసలు మనదేశం వొదిలి ఇక్కడికెందుకు వొచ్చాననుకొంటున్నారు."

"ఇక్కడ డబ్బు చాలా సంపాదించుకోవచ్చునని...."

"అందుకు కాదు-మన దేశం- ఘనత వహించిన మన పవిత్ర భారత దేశం నన్ను డాక్టర్‌గా బతకనియ్యలేదు.అంచేత డాక్టర్‌ని,డాక్టర్‌గా ఉండాలని ఇక్కడికి వచ్చాను.

"అప్పుడు నేను ఆ ఊళ్ళో గవర్నమెంట్ ఆస్పత్రిలో డాక్టర్‌గా వున్నాను. ఊరి పేరెందుకు లెండి. పల్లె, పట్నం

## చీడ పురుగు

సినిమా రథమెక్కి,
సంగీతం విల్లు సవరించి,
సెక్స్ పూలబాణం విసురుతున్నాడు
కళా మన్మథుడు.
అంటుకున్న ఉద్రేకాలు
మనసుల్లో పండిస్తున్నాయి సిఫిలిస్
పంటల్ని.

—సౌభాగ్య

కాని టౌన్ అది. రమ కూడా నాతోపాటు అక్కడే డాక్టర్‌గా వుంది. ఒక రోజు క్యూలో వస్తున్న రోగులని చూస్తున్నాను. ఒక పెద్దమనిషి- అతడి ముఖం చూస్తే పెద్దమనిషిలా లేదు. రౌడీలా వున్నాడు. ఆ సమయంలో రౌడీ అనే అనుకున్నాను. క్యూలో నిలబడకుండా అందర్నీ తోసుకుని ముందుకొచ్చాడు. దర్జాగా నా ముందున్న కుర్చీలోకూచుని "డాక్టర్! నాకు కడుపులో గుడగుడ...." అంటూ తన పెద్ద బొజ్జను చూపిస్తూ ఏదో చెప్పబోయాడు.

నేను చికాగ్గా "మిస్టర్! మీరు ముందు వెళ్ళి క్యూలో నిలబడండి. మీ రోగాలన్నీ మీ ఛాన్స్‌వచ్చినప్పుడు వింటాను" అన్నాను.

అతడు ముఖం జేవురించుకుని "నేనెవరో నీకు తెలుసా?" అన్నాడు.

ఆ ఏకవచన ప్రయోగం, ఆ మాట్లాడే ధోరణి నాకు మరింత చికాకుకలిగించింది.

"మీరెవరో నాకు తెలీదు. తెలియక్కర్లేదు. నేను డాక్టర్ని. మీరు తెలుసుకోండి అది చాలు! ముందిక్కడి నుంచివెళ్ళండి" కఠినంగా అన్నాను.

అతడు వెళ్ళిపోయాడు. తిరిగి క్యూలో రాలేదు. నేనా విషయం పట్టించుకోలేదు. కానీ, ఒక అరగంట కూడా కాకుండానే నాకు మా సూపరింటెండెంట్ దగ్గర్నుంచి పిలుపొచ్చింది. నేను వెళ్ళాను. అక్కడ ఆ పెద్ద మనిషి లేక రౌడీలా కనపడే పెద్ద మనిషి వున్నాడు.మా సూపరింటెండెంట్ నన్ను చూసి కోపంగా "డాక్టర్! ఏమిటి, మీరు చేసిన పని? ఈయన మన యం. యల్. ఏ. గణపతి గారు తెలుసా? ఈయన్ని కూడా క్యూలో రమ్మన్నారా?" అన్నాడు.

"నేను చేసిన తప్పేది లేదు సార్! ఈయన యం. యల్. ఏ. అని నాకు తెలీదు. ఆయన ఆ విషయం చెప్పలేదు. తిన్నగా వచ్చి నా ఎదురుగా కుర్చీలో కూచున్నారు. ఒక డాక్టర్‌గా రోగుల విషయంలో పక్షపాతం చూపక పోవటం నా విధి."

"సరే! అయిందేదో అయింది ఇప్పుడైనా ఈయనకు క్షమాపణచెప్పుకోండి."

"నేను చేసిన తప్పేమీ లేదు. క్షమాపణ చెప్పుకోవలసిన అవసరం లేదు."

"ఇదే మీ చివరి మాటా?"

"ఇందులో రెండు మాటలు వుండవలసిన అవసరమే లేదు."

"సరే! మీరు వెళ్ళొచ్చు."

డాక్టర్ కృష్ణ ఆగాడు. అతని కళ్ళలో ఇప్పటికీ ఆనాటి అవమానం మండుతోంది.

"ఆ తరువాత ఏం జరిగింది?" కుతూహలం, నాలో—

"ఏం జరిగిందా? పేషెంట్స్‌ని సరిగ్గా చూడటం లేదని నామీద ఛార్జి వచ్చింది—కేసయింది— ఎలాగో నాదేం తప్పులేదని రుజువయిందనుకో! కానీ,నాకు ఆ హాస్పిటల్స్ అన్నా, ఆ వాతావరణమన్నా, ఆ ప్రభుత్వమన్నా, అసహ్యం వేసింది— అదృష్టం బాగుండి ఇక్కడ అవకాశం దొరికింది— వచ్చేశాను. ఇక్కడ నాకు డబ్బేకాదు— డాక్టర్‌గా నా పేషెంట్స్‌కి న్యాయం చేయగలుగుతున్నానన్న సంతృప్తి కూడా దక్కుతోంది అది ముఖ్యం నాకు-"

నాకు చాలాబాధగాతోచింది-ఒక మంచి డాక్టర్ని గుర్తించటానికి బదులుగా డ్యూటీ సరిగా చేయడం లేదని కేసు పెట్టడం....

"నా మీద కూడా ఒక కేస్ వచ్చింది— ఈయన ధర్మపత్నినని పించుకొన్నాను—" అన్నారు డాక్టర్ రమ.

"ఆ వింత కూడా చెప్పండి—" అన్నాను.

"ఒక అబార్షన్ కేసు ఏదో పల్లెటూరి నుంచి బండి కట్టించుకుని తీసుకొచ్చారు. చివరి క్షణాల్లో తీసుకొచ్చారు. మా హాస్పిటల్ పేరుకేవుంది. అక్కడ బ్లడ్ లేదు. సరైన యెక్విప్‌మెంట్ లేదు-

మందులు అసలే లేవు– ఏనాటివో ఇన్ని ఎ.పి.సి. మాత్రలు మాత్రం వున్నాయి సీసాలనిండా.... ఆ పేషెంట్‌ని చూడగానే పరిస్థితి ప్రమాదకరంగా ఉందని అర్థమయింది– అయితే ఇంకా ఆశలేక పోలేదు– వెంటనే కారులో సిటీకి తీసి కెళ్తే– పెద్ద హాస్పిటల్‌లో చేర్పిస్తే బతకొచ్చు– చూస్తూ చూస్తూ ఎందుకూ పనికి రాని మా హాస్పిటల్‌లో ఆ పేషెంట్‌ని చేర్చుకుని నిండుప్రాణం చేతులారా తీయలేక, సిటీకి తీసికెళ్ళమని నేనే చెప్పాను. అయితే వాళ్ళకు వెంటనే టాక్సీ దొరకలేదు- అప్పట్లో మాకూ కారు లేదు- వాళ్ళు ఎలాగో కారు సంపాదించి ప్రయాణమయ్యేసరికి ఆ పేషెంట్ దారిలోనే చచ్చిపోయింది ప్రమాద పరిస్థితిలో ఉన్న పేషెంట్‌ని చేర్చుకోకుండా పంపేశానని నామీద కేసు. అబ్బ! ఆ ఆస్పత్రిలో పనిచేస్తున్నన్నాళ్ళూ రోజూ మానసికంగా చిత్రవధ అనుభవించేదాన్ని. తెలిసి తెలిసి రోగులకు మందులు ఇయ్యలేక ఏ రంగు నీళ్ళో ఇచ్చి పంపవలసివచ్చినప్పుడు ఆ డాక్టర్ పడే బాధ సిన్సియారిటీ వున్న డాక్టర్‌కే అర్థమవుతుంది. ఇక్కడికి వచ్చాక నా ప్రాణానికి హాయిగా వుంది."

నిట్టూర్చారు డాక్టర్ రమ నా మనసుకి చాలా కష్టం వేసింది. ఏం దేశం నాది! ప్రతిభావంతుల ప్రతిభను సవ్యంగా వినియోగించుకోవటం కూడా చేతకాని దేశం? తమ దేశ ప్రతిభను చేజేతులా పరదేశాలకు తరుముతున్న దేశం. ప్రతిభ, శక్తి సామర్థ్యాలు- సిన్సియారిటీ ఇవేవీ అక్కర్లేదు. ఎక్కడికక్కడ ఆమ్యామ్యాలూ, పైరవీలూ, అధికార అహంకారాలూ, వాటిని వెన్నంటి భట్రాజుల కాకా సంగీతాలు!

ఇంతలో డాక్టర్ కృష్ణకి ఎక్కడి నుంచో ఫోన్ వచ్చింది. ఫోన్‌లో మాట్లాడి నా దగ్గరికి వచ్చి "మీకొక విచిత్రమైన కేస్ చూపిస్తాను వస్తారా? దారిలో కొంత లండన్ కూడా చూడొచ్చు" అన్నారు. నేను వచ్చిందే నగరం చూడటానికి. వెంటనే బయలుదేరాను.

"మేడమ్ టుసాడ్స్ చూశారా?" అని అడిగారు.

"చూశాను అన్నాను. నేను రాగానే మొదట చూసిందే అది. బాబీ చూపించాడు. అది వేల్స్ మ్యూజియమ్. మేడమ్ టుసాడ్స్ (Madame Tussaudhs) అనే ఆవిడ ప్రారంభించబట్టి దానికి ఆ పేరు వచ్చిందట! అందులో మైనంతో తయారుచేసిన శిల్పాలన్నీ జీవకళకు పెట్టింది పేరు. మన ఇందిరా గాంధితోపాటు ప్రసిద్ధ నాయకుల శిల్పాలన్నీవున్నాయి. మైనంతో తయారుచేసినవి. వాటిలో స్లీపింగ్ బ్యూటీ అద్భుతమంటారు. కానీ అంత కంటె నా మనసులో నిల్చింది. "ది ఛేంబర్ ఆఫ్ హారర్స్" (The Chamber of Horrors) ఆ రోజు ఒక్కొక్కళ్ళు భయంతో గట్టిగా కేకలు పెడుతూనే, ఆ శిల్పాల దగ్గర నుంచి కదలలేకపోయేవారు. ముగ్గురు నలుగురు జట్లుగా తప్ప ఒక్కరూ వెళ్ళలేని విభాగం అది. అంత భయంకరంగా వుంది, మానవుడి హృదయంలో ఏ మూలో క్రౌర్యం వుంది. హింసాత్మక ప్రవృత్తి వుంది. లేకపోతే ఆ శిల్పాల పట్ల అంత ఆకర్షణ వుండదు. బాత్ టబ్‌లో హత్యచేయబడ్డ యువతి శిల్పం ఎంతో భయంకరంగా- మరెంతో సజీవంగావుంది. అప్పుడే హత్యచేయబడ్డట్టు పరమ భీతావహంగా వుంది. నగ్నంగా వున్న ఆ యువతి ఒక కాలు బాత్‌టబ్ బయట వుంది. కళ్ళు బయటకుబికి ఇంకా మరణాన్ని ఎదుర్కొన్న బీభత్సాన్ని ప్రేక్షకులకు చూపిస్తున్నాయి. అలాగే ఉరితీయబడుతున్న ఖైదీలు. ఖైదుల్లో మగ్గిపోయి ఉన్మాదులైపోయిన వారి భయంకర ఆర్తనాదాలు! ఇవన్నీ రివల్యూషన్ టైమ్ నాటి ఇన్స్పిరేషన్‌తో తయారుచేసినవట!

"లండన్‌లో గర్వించతగ్గది వేల్స్ మ్యూజియమ్!" అన్నారు డాక్టర్ కృష్ణ. నేను వెంటనే ఒప్పుకున్నాను. లండన్ టవర్, బ్రిటిష్ మ్యూజియమ్ కూడా చూశానని చెప్పాను. డాక్టర్ కృష్ణ నాకు కారులోంచే పార్లమెంట్ భవనాలను చూపించారు. బకింగ్‌హామ్ పేలెస్— దానికి ముందు యూనిఫాంస్‌లో వున్న గార్డ్స్: ట్రెఫాల్గర్ స్క్వేర్, అక్కడి ఫౌంటెన్స్, రకరకాల పావురాళ్ళు— నెల్సన్స్ కోలమ్, థేమ్స్ నది, దానిపై కట్టిన టవర్ బ్రిడ్జ్-మొదలైనవి చూపిస్తూ కారు డ్రైవ్ చేస్తున్నారు— టవర్ బ్రిడ్జ్ ప్రత్యేకత— సముద్రంలో పెద్దపెద్ద ఓడలు వెళ్తున్నప్పుడు రెండు తలుపులలాంటివి (Basculer) తెరుచుకుని ఓడలకు దారిఇవ్వటం. ఇవి ఒక్కొక్కటి దాదాపు వేయిటన్నుల బరువుంటాయట! ఓడలు దాటిపోగానే తిరిగి మూసుకుపోతాయి. ఆ తరువాత సౌత్ బేంక్ స్ట్రీట్‌లో వున్న థియేటర్స్ చూపించారు. అక్కడ ఇండియన్స్‌కూడా నాటకాలూ, నాట్యాలూ, సంగీత కచేరీలు మొదలైనవి ప్రదర్శిస్తారనీ, గవర్నమెంట్ కూడా కొంత సబ్సిడీ ఇస్తుందనీ చెప్పారు. ఆ తర్వాత బిగ్‌బెన్ పక్కనే ఉన్న బోడిసియా శిల్పం చూపించారు (Bodicea



కళాభారతి పదవ వార్షికోత్సవ సందర్భంగా వేదికపై (ఎడమనుండి) శ్రీయుతులు ఎల్. వి. ప్రసాద్, ఎన్. టి. ఆర్. దాసరి, మిక్కిలినేని, ఆత్రేయ

statue). ఆ శిల్పం ఒకప్పుడు ఆ దేశాన్ని పరిపాలించిన ప్రాచీన జాతుల రాణి దట. ఆమె వెంట ఆమె కూతుళ్ళు కూడా ఉన్నారు. వారంతా ఏదో రథంలో యుద్ధానికి వెళ్తున్నట్లుగా ఉంది ఆ శిల్పం. అక్కడ ప్రాచీన జాతులలో రాణులే పరిపాలించేవారో, యుద్ధాలకుకూడా వాళ్ళే వెళ్ళేవారో ఏమో! ఆ చారిత్రక విషయాలేమీ తెలియవు.

"ఇక్కడ ఓపెన్ యూనివర్శిటీ ఓ ప్రత్యేకత- అది చూశారా" అని అడిగారు. చూశాను మిల్టన్ కీన్స్‌కి దగ్గరలో వుంది. డాక్టర్ ప్రసాద్ దంపతుల సాయంతో చూడగలిగాను. అదీ, బుద్ధదేవుని పగోడా. రెండూ మిల్టన్ కీన్స్‌లో ఉన్నప్పుడే చూశాను. బౌద్ధ దేవాలయ సింహద్వారాన రాజసం ఉట్టిపడే రెండు సింహాల శిల్పాలు కనబడటమే ఆశ్చర్యం! బ్రిటన్‌లో తప్ప బౌద్ధ దేవాలయంముందు సింహ శిల్పాలను ఎక్కడా చూడలేదు. అవి బ్రిటిష్ సింహాలు! బుద్ధదేవుడైనా వాటిని అంగీకరించవలసిందే బ్రిటన్‌లో ఉన్నంత వరకూ—

కారు ఒక ఇంటిముందు ఆగింది. బ్రిటన్‌లో కూడా అమెరికాలో లాగానే ఇళ్ళన్నీ ఇంచుమించు ఒకలాగే ఉంటాయి. అమెరికా ఇళ్ళలో ఉండే బేస్‌మెంట్ బ్రిటన్ ఇళ్ళలో ఉండదు. ప్రధానమైన భేదం. పెద్ద పెద్ద లార్డ్స్ ఇళ్ళు మాత్రం వేరుగా ఉంటాయి. అవి నగరానికి దూరంగా పల్లె ప్రాంతాలలో ఉంటాయి. పోష్ లొకాలిటీస్‌లో కామన్ ప్లేసెస్ అని పెద్ద పెద్ద మైదానాలు ఏ విధమైన కట్టడాలు లేకుండా వదిలేస్తారు. అందువల్ల ఆ ప్రాంతాలకు ఎంతో అందం వస్తుంది. చాలా ఇళ్ళ ముందు పికాసో శిల్పాలున్నాయి. అవి చాలా ధనవంతుల ఇళ్ళని చెప్పారు కృష్ణ.

పేషెంట్ అనేసరికి అతడు ఏ రోగంతో బాధపడుతున్నాడో అనుకున్నాను. నిజానికి అతడికి ఏ రోగమూ లేదు. కానీ వృద్ధుడు. అంత ఇంట్లో ఒక్కడూ ఉన్నాడు. అక్కడ పనివాళ్ళు దొరకరు కాబట్టి అతడికి ఏమైనా కావాలంటే, అందించే దిక్కుకూడా లేదు. కొడుకులు, కూతుళ్ళు ఉన్నారట! అప్పుడప్పుడు ఫోన్‌లో పలకరిస్తారట! వచ్చి చూడటానికి వాళ్ళకు తీరిక ఉండదట! వారమంతా పనిట! వారాంతంలో ఎక్కడికైనా పల్లె ప్రాంతాలకు వెళ్తారట!

పాపం! నా అనేవాళ్ళు లేక ఒక్కడూ అల్లాడిపోతున్న ఆ పండు ముసలిని చూస్తే కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆయనా, కృష్ణా ఇంగ్లీషులో మాట్లాడుకున్నారు. కృష్ణ ఆయనకు ధైర్యం చెపుతున్నారు. ఆయన కృష్ణనూ, నన్నూ మరికొంతసేపు వుండమని బ్రతిమాలుతున్నారు. పసిపిల్లాడిలా కృష్ణ చేతులు పట్టుకుని వదలటం లేదు. ఒక అరగంట అతనితో అదీ, ఇదీ మాట్లాడి, ఎలాగో ఆయనకు నచ్చచెప్పి లేచారు కృష్ణ.

"ఇదా ఆయనకు మీరు చేస్తున్న వైద్యం?" అన్నాను ఆశ్చర్యంగా తిరిగి వస్తున్నప్పుడు.

"అవును-అతడికి కావలసింది మందులు కావు అతడికి ఏ జబ్బూలేదు-నా అనేవాళ్ళు లేక అశాంతితో బాధపడుతున్నాడు-నిజానికి ఈ కేసు ఒక సైకియాట్రిస్ట్ చూడవలసింది. ఇక్కడ ఇలాంటి కేసులు లెక్కలేనన్ని-ఇలా అశాంతితో బాధపడేవాళ్ళు ముసలివాళ్ళే కాదు, యువతీ యువకులలోనూ చాలా మంది ఉన్నారు. విచిత్రంగా ఎందుకో అతనికి నేనంటే అభిమానం ఏర్పడింది. బహుశః ఆ వృద్ధుణ్ని చూడగానే మా నాన్నగారు గుర్తొచ్చి అతడితో ఆప్యాయంగా మాట్లాడటంవల్ల కావచ్చు! అందుకే నేను సైకియాట్రిస్ట్‌ని చూడమని చెప్పినా "ఎంత ఫీజ్ అయినా ఇస్తాను, మీరే రండి" అంటాడు. పాపం! డబ్బిచ్చి అభిమానాన్ని-అదీ వారానికో అర గంట కొనుక్కునే దౌర్భాగ్య స్థితిలో వున్నాడు-"

కృష్ణ గొంతు భారంగా అయింది- నాకూ మనసంతా వికలమయింది. పైకి భోగభాగ్యాలు ఉట్టిపడే ఈ పాశ్చాత్య నగరంలో లోలోపల ఉడికిపోయే ఈ దుర్భర విషాదం-ఏ మనిషీ భరించలేని ఈ ఒంటరితనం, నా శత్రువుకుకూడా వద్దనిపించింది. చాలాసేపు ఇద్దరం మౌనంగా ఉండిపోయాం ఎప్పటికో కృష్ణ అన్నారు.

"నేనిక్కడే ఉండిపోవాలని అనుకోవటం లేదు. మనదేశం వచ్చేస్తాను. కానీ ఇప్పుడు కాదు. ఏ ప్రభుత్వ దయాదాక్షిణ్యాలతోను నిమిత్తం లేకుండా ఆస్పత్రి నేను నడుపుకోగలిగే స్తోమతు వచ్చాక. నాకు రాబడి వున్నా, లేకపోయినా అక్కడి నా పేద ప్రజలకు సేవ చెయ్యగలిగే స్తోమతు వచ్చాక అక్కడికి వచ్చేస్తాను. మమతా శూన్యమయిన, అనుబంధ విరహితమయిన ఈ లోకం నాకక్కర్లేదు. మన దేశం వచ్చేస్తాను."

నేను మాట్లాడలేదు చెమ్మగిలిన నా కళ్ళు తుడుచుకుంటూ చల్లని మంచుకురిసే ఆ నగరాన్ని చూస్తూ ఉండిపోయాను.

లండన్‌లో నాకు ఆతిథ్యమిచ్చిన, జ్యోతి, బాబీ దంపతులకూ, కన్నా డాక్టర్ ప్రసాద్ దంపతులకూ డాక్టర్ రమ డాక్టర్ కృష్ణ దంపతులకూ, కృష్ణ మూర్తి గారికీ కృతజ్ఞతలతో.



ఇటీవల తమిళనాడు ప్రభుత్వం ప్రఖ్యాత ఆంధ్ర నటుడు, మేకప్ స్పెషలిస్ట్ డాక్టర్ చంద్రశేఖర్ ఫొటో ప్రదర్శనను మద్రాసులో ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయనను అభినందిస్తున్న యువజన సేవల డైరెక్టర్ శ్రీ యు. ఎస్. నటరాజన్, మధ్యలో ఫిల్మ్ టెక్నాలజీ సంస్థ ప్రిన్సిపాల్ శ్రీ పి. నీలకంఠన్